

సాంకేతిక సాకు.. తిరకాసు

స్టాక్ హోల్డ్ ఏజెన్సీ దందాకు తెరలేపింది. అయినా స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. 10లో



చీనీ టన్ను రూ.30 వేలు

అనంతపురం మార్కెట్‌యార్డులో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.30 వేలు పలికాయి.



జిల్లా అంతటా బుధవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. నైరుతి దిశగా గంటకు 8 నుంచి 16 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

నేటి నుంచి కేంద్ర బృందం పర్యటన



యల్లనూరు ఎంపీడీఓ కార్యాలయంలో సమీక్షిస్తున్న ఏపీడీ పుల్లారెడ్డి

అనంతపురం టౌన్/యల్లనూరు: జిల్లాలో గురువారం నుంచి మూడు రోజుల పాటు కేంద్ర బృందం పర్యటించనున్నట్లు జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ సలీం బాషా తెలిపారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులను క్షేత్ర స్థాయిలో పరిశీలించనున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం జాతీయ స్థాయి పర్యవేక్షణ కమిటీ సభ్యులు నవనీతదాస్, వెంకటేశ్వరన్‌తో కలిసి జిల్లా అధికారులతో నగరంలోని డ్వామా కార్యాలయంలో ఆయన సమీక్ష నిర్వహించారు. యల్లనూరు మండలం చింత కాయమంద, మల్లాగుండ్ల, అనంతపురం రూరల్ మండలం కందుకూరు, అనంతపురం రూరల్ పంచాయతీల్లో చేపట్టిన ఉపాధి పనులను కేంద్ర బృందం పరిశీలించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

- కేంద్ర బృందం పర్యటనపై బుధవారం యల్లనూరు ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో ఏపీడీ పుల్లారెడ్డి సమావేశం నిర్వహించారు. ఆయా పనులకు సంబంధించిన నివేదికలను సిద్ధం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కరుణసాగర్, ఈసీ సత్యమూర్తి,టీఏలు జయరాం,ప్రసాద్, పురుషోత్తం నాయుడు, హరికుమార్‌రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

బీటెక్ ఫలితాల విడుదల



ఫలితాలు విడుదల చేస్తున్న జేఎన్‌టీయూ అధికారులు

అనంతపురం: బీటెక్ ఫలితాలు విడుదలయ్యాయి. జేఎన్‌టీయూ అనంతపురం పరిధిలో ఏప్రిల్, మే నెలలో నిర్వహించిన బీటెక్ నాలుగో సంవత్సరం ఒకటో సెమిస్టర్ (ఆర్-20), (ఆర్-19), (ఆర్-15) సప్లిమెంటరీ, బీఫార్మసీ ఒకటో సంవత్సరం రెండో సెమిస్టర్ (ఆర్-23), (ఆర్-19), (ఆర్-15) సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలను డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ వి. నాగప్రసాద్ నాయుడు బుధవారం విడుదల చేశారు. ఫలితాల కోసం వర్సిటీ వెబ్‌సైట్‌లో చూడాలని కోరారు. కార్యక్రమంలో కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ ఏపీ శివకుమార్, అడిషనల్ కంట్రోలర్స్ ప్రొఫెసర్ జి. శంకర్ శేఖర్ రాజు, డాక్టర్ శ్రీధర్, డాక్టర్ అంకారావు పాల్గొన్నారు.

19 నుంచి సౌత్‌జోన్ సీనియర్ టీ-20 క్రికెట్ టోర్నీ



అనంతపురం: ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 19 నుంచి 25వ తేదీ వరకూ ఆర్డీటీ స్టేడియం వేదికగా సౌత్ జోన్ సీనియర్ టీ-20 క్రికెట్ టోర్నీ నిర్వహించనున్నారు. మొత్తం 5 జట్లు ప్రాతినిధ్యం వహించే ఈ టోర్నీని రౌండ్ రాబిన్ లీగల్ ఫార్మెట్‌లో నిర్వహిస్తున్నారు. టోర్నీలో ప్రాతినిధ్యం వహించే అనంతపురం జట్టుకు క్రీడాకారులను ఎంపిక చేశారు. ఎంపికైన వారిలో బి.వినయ్‌కుమార్, పి.గిరినాథరెడ్డి, పి.అర్జున్‌టెండూల్కర్, మచ్చా దత్తారెడ్డి, ఎం.రాజకుల్లాయప్ప, టి.మహేందరరెడ్డి, జి.సంపత్‌కుమార్, బి.సంతోష్, రోహిత్ రోషన్, జి.మల్లికార్జున, ఎస్ఎండీ కమిల్, ఎం.దీపక్, ఎస్.మహబూబ్‌పీరా, టి.ప్రదీప్‌రెడ్డి, కోగటం హనీష్ వీరారెడ్డి, చైత్ర వర్ధన్‌తో పాటు స్టాండ్ బైగా కె.ప్రమోద్, బి.ప్రశాంత్, భానుప్రకాష్, ఎంకే లోహిత్ సాయికిషోర్, పి.వికాస్ ఉన్నారు.

ఎంటీఎస్ టీచర్ల సర్దుబాటుకు గ్రీన్‌సిగ్నల్

అనంతపురం ఎడ్యుకేషన్: అవసరమైన పాఠశాలలకు 1998, 2008 ఎంటీఎస్ టీచర్లను సర్దుబాటు చేసేందుకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. బుధవారం పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ విజయరామరాజు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ప్రక్రియ ఈనెల 20లోపు పూర్తి చేయాలంటూ జిల్లా విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. ముందుగా సీనియార్టీ జాబితాను తయారు చేయనున్నారు. సీనియార్టీని అనుసరించి అవసరమైన స్కూళ్లకు సర్దుబాటు చేస్తామని డీఈఓ ఎం.ప్రసాద్‌బాబు తెలిపారు.

- ధర్మవరం పట్టణానికి చెందిన షేక్ కరీముల్లా ప్లంబింగ్ పని చేసేవాడు. ఐపీఎల్ బెట్టింగ్‌లో రూ.3 లక్షల వరకూ పోగొట్టుకున్నాడు. దీంతో అప్పులిచ్చిన వారు వెంటపడటంతో ఇటీవల బెంగుళూరులో ఉరివేసుకుని చనిపోయాడు.
- కదిరికి చెందిన సోమసుందర్ రాజు రియల్ ఎస్టేట్ వ్యాపారి ఇటీవల ఐపీఎల్ సమయంలో బెట్టింగ్ ఆడి రూ.30 లక్షలు పోగొట్టుకున్నాడు. భార్య నగలన్నీ అమ్మేశాడు. ఇప్పుడతను ఊరు వదిలి బెంగుళూరు పరారయ్యాడు. అప్పు ఇచ్చిన వాళ్లు లబోదిబోమంటున్నారు.

ఐపీఎల్ ముగిసి.. కష్టాలు మిగిలి

- బెట్టింగ్‌లతో అప్పుల పాలైన వేలాదిమంది యువకులు
- నెలలోనే ఉమ్మడి జిల్లాలో 13 మంది ఆత్మహత్య
- అప్పులోళ్ల బాధ తట్టుకోలేక పలువురు ఊళ్లు వదిలిన వైనం
- బెట్టింగ్ ఉచ్చులో పలువురు ప్రభుత్వ ఉద్యోగులూ ..





బతుకులు అవుట్!

సాక్షి ప్రతినిధి, అనంతపురం: దురాశ దుఃఖానికి చేటు అని ఊరికే అనలేదేమో! రాత్రికి రాత్రే కోటీశ్వరులవుదామన్న ఆలోచన వేల కుటుంబాలను నిలువునా ముంచేసింది. చదువుకుని.. ఆలోచించే సామర్థ్యముండీ.. కష్టపడే స్వభావం ఉన్న యువకులనూ దురాలోచన ముంచేసింది. బెట్టింగ్ బెట్టింగ్ బెట్టింగ్... అంటూ దాని వెంటపడి చివరకు ప్రాణాలే పణంగా పెట్టారు. సుమారు 45 రోజుల పాటు సాగిన ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) క్రికెట్ మ్యాచ్‌లు ఉమ్మడి అనంతపురం జిల్లాలో వేల కుటుంబాలను నిలువ నీడ లేకుండా చేశాయి.

13 మంది ఆత్మహత్య

క్రికెట్ బెట్టింగ్ భూతం చాలా కుటుంబాలను కల్లోలంలోకి నెట్టింది. ఉమ్మడి జిల్లాలో ఐపీఎల్ మ్యాచ్‌లపై బెట్టింగ్ ఆడి సర్వస్వం పోగొట్టుకున్న 13 మంది ఆత్మహత్య చేసుకున్నారు. కొంతమంది ఊళ్లు వదిలి వెళ్లారు. ఇంకొందరు ఆస్తులు తాకట్టు పెట్టారు. మరికొందరు తమకున్న కొద్దిపాటి భూములను కూడా అమ్మేసి అప్పు కట్టిన పరిస్థితి. చాలామంది తమ భార్యల బంగారు నగలను తాకట్టు పెట్టి బెట్టింగ్ ఆడి సర్వస్వం కోల్పోయారు. ఇప్పుడు బోరున విలపిస్తున్నారు.

కదిరి, తాడిపత్రిలలో అత్యధికంగా..

ఉమ్మడి అనంతపురం జిల్లాలో తాడిపత్రి, కదిరి ప్రాంతాల్లో చాలా మంది ఐపీఎల్ బెట్టింగ్ భూతానికి చిక్కి నష్టపోయినట్టు వెల్లడైంది. ఎక్కువ పోలీసు కేసులు కూడా ఈ ప్రాంతాల్లోనే నమోదు కావడం గమనార్హం. ఈ రెండు నియోజకవర్గాల్లోనే బుకీలు ఎక్కువగా ఉన్నట్లు తేలింది. ఉమ్మడి జిల్లాలో మిగతా ప్రాంతాల్లోనూ బాగానే బెట్టింగ్ జరిగింది. మ్యాచ్ మ్యాచ్‌కు కాకుండా ఓవర్ టు ఓవర్‌కు కూడా పందెం కాశారు. ఈ క్రమంలో డబ్బు పోగొట్టుకున్న వారు ఊరు వదిలి వెళ్లిపోవడంతో అప్పులిచ్చిన కుటుంబాలు వీధిన పడ్డాయి.కొంతమంది ప్రభుత్వ ఉద్యోగులు సైతం బెట్టింగ్‌లో మునిగి కుటుంబాలను బజారున పడేశారు. ఐటీ ఉద్యోగులు కూడా ఎక్కువమంది నష్టపోయారు.

ఐపీఎల్ జరిగిన రోజులు	45
మొత్తం మ్యాచ్‌లు	74
ఉమ్మడి జిల్లాలో బెట్టింగ్ వ్యయం	రూ.1,000 కోట్లు పైనే
బెట్టింగ్‌లో నష్టపోయిన వారు	3,000 మంది పైనే
బెట్టింగ్ కారణంగా ఆత్మహత్యలు	13

స్వీయనియంత్రణ పాటించాలి



బెట్టింగ్‌లో సర్వస్వం కోల్పోయి నా దగ్గరకు వచ్చిన వాళ్లలో ఐటీ ఉద్యోగులే ఎక్కువ. డ్రగ్స్ కంటే ప్రమాదకరంగా మారింది. దీన్ని అడిక్షన్ డిజార్డర్‌గా చెప్పుకోవచ్చు. ముందు అలవాటవుతుంది.. తర్వాత వ్యసనమై చివరకు జబ్బుగా మారుతుంది. ఆన్‌లైన్ యాప్‌ల జోలికి వెళ్లకుండా స్వీయ నియంత్రణ పాటించడం తప్ప చేయగలిగిందేమీ లేదు.

–డా.ఎండ్లూరి ప్రభాకర్, మానసిక వైద్యనిపుణులు, అనంతపురం

'యోగాంధ్ర'కు 280 బస్సులు

అనంతపురం క్రైం: కూటమి ప్రభుత్వం విశాఖపట్నంలో నిర్వహిస్తున్న యోగాంధ్ర-2025 కార్యక్రమానికి అనంతపురం ఆర్టీసీ రీజియన్ నుంచి 280 బస్సులు వెళ్లనున్నాయి. జిల్లాలో ఆయా బస్సు రూట్లను 20వ తేదీ రాత్రి నుంచి రద్దు చేశారు. కూటమి సర్కారు వచ్చిన నాటి నుంచి ఇష్టారాజ్యంగా ఆర్టీసీ బస్సులను దారి మళ్లిస్తుండడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల కడపలో నిర్వహించిన టీడీపీ మహానాడు కార్యక్రమానికి ఏకంగా 400కు పైగా బస్సులను తరలించారు. దీంతో అప్పట్లో ప్రయాణికులు పడరాని పాట్లు పడ్డారు. తాజాగా యోగాంధ్ర అంటూ విశాఖ పట్నానికి బస్సులను మళ్లిస్తుండడంపై ప్రజలు మండిపడుతున్నారు. సామాన్యుల గురించి పట్టించుకోరా అంటూ నిలదీస్తున్నారు. ఉన్నట్లుండి బస్సులను రద్దు చేస్తే సామాన్యులు ఎంత ఇబ్బంది పడతారో టీడీపీ నేతలు, ఉన్నతాధికారులు ఆలోచించాలని సూచిస్తున్నారు. ఇదిలాఉంటే.. ఇష్టారాజ్యంగా బస్సుల మళ్లింపుపై ప్రజల నుంచి ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలనే ఆలోచనలో పడినట్లు తెలిసింది.

జెడ్పీ సీఈఓ శివశంకర్ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు చేపట్టిన సీఈఓ శివశంకర్

అనంతపురం సిటీ: ఉమ్మడి జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి(సీఈఓ)గా శివశంకర్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరంలో డ్వామా ఏపీడీగా పని చేస్తున్న ఆయన్ను జెడ్పీ సీఈఓగా బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన సంగతి తెలిసిందే. డిప్యూటీ సీఈఓ వెంకటసుబ్బయ్య నుంచి ఆయన చార్జ్ తీసుకున్నారు.

- కార్పొరేషన్ స్కూళ్ల టీచర్ల లీలలు
- అనుకూలమైన పాఠశాలల కోసం అడ్డదారులు తొక్కడంపై విమర్శలు

ఇదేం పద్ధతి మాస్టార్లూ..

అనంతపురం ఎడ్యుకేషన్: కార్పొరేషన్ పాఠశాలల్లో పని చేస్తున్న కొందరు ఉపాధ్యాయులు తమకు అనుకూలమైన స్కూళ్ల కోసం అడ్డదారులు తొక్కారు. కక్కుర్తి పడి అడ్డగోలుగా పాయింట్లు వేసుకోవడం చర్చనీయాంశంగా మారింది. వెబ్ కౌన్సెలింగ్‌లో తమను ఎవరూ పట్టించుకోరనే ధీమాతో ఇలా అడ్డగోలు పాయింట్లు పెట్టుకున్నారు. శారదా నగర పాలక బాలికల పాఠశాలలో హిందీ టీచర్‌గా పని చేస్తున్న చంద్రకళ భర్త ఎంటీఎస్ టీచరు. ఎంటీఎస్ టీచర్లకు స్పౌజ్ వర్తించదు. అయినా చంద్రకళ స్పౌజ్ పాయింట్లతో నేతాజీ స్కూల్‌కు వెళ్లారు. జ్యోతి అనే ఇంగ్లిష్ టీచరు సుమారు ఐదేళ్ల క్రితం స్పౌజ్ పాయింట్లతోనే శారదా స్కూల్‌కు వచ్చారు. ప్రస్తుతం రిక్వెస్ట్ బదిలీకి కూడా స్పౌజ్ పాయింట్లు వేసుకుని ఆర్ఎంహెచ్ఎస్ స్కూల్‌కు వెళ్లారు. అలాగే మరో తెలుగు టీచర్ పుల్లమ్మ స్పౌజ్ పాయింట్లతో ఎస్కేడీ పాఠశాలకు వెళ్లారు.

ఎవరి కోసం రిలీవ్ చేయొద్దన్నారో..

పాతూరు కస్తూర్బా బాలికల పాఠశాలలో సోషల్ టీచర్‌గా పని చేస్తున్న మనోరంజని 8 ఏళ్లు పూర్తయినా.. ఏడాదిలో రిటైర్డ్ కాబోతున్నారు. ఈమె విల్లింగ్ ఉంటే తప్ప బయటకు పంపరు.



అనంతపురం శారదా బాలికల స్కూల్‌లో చేరిన ఉపాధ్యాయులు

ఆమె దరఖాస్తు చేసుకున్నారు. ఈ క్రమంలో ఎస్కేడీ పాఠశాల అలాట్ కావడంతో ఉత్తర్వులు వెలువడ్డాయి. కానీ ఆమెకు నచ్చిన స్కూల్ రాలేదంటూ ఇప్పటికీ రిలీవ్ కాలేదు. డీఈఓ కార్యాలయం నుంచి వచ్చిన మౌఖిక ఆదేశాలతో అక్కడే కొనసాగుతున్నారు. కాగా కస్తూర్బా స్కూల్ నుంచి ఎస్కేడీ స్కూల్ లాగిన్‌కు మనోరంజని పేరు మార్పు జరిగింది. అయినా నేటికీ డిప్యూటేషన్‌పై వస్తున్నట్లు అటెండెన్స్ వేస్తున్నారు. మరోవైపు ఎస్కేడీ పాఠశాలలో సోషల్‌లో మూడు పోస్టులుంటే ఈమె వెళ్లకపోవడంతో ఇద్దరే పని చేస్తున్నారు.

అధికారుల ఇష్టారాజ్యం..

బాలికల పాఠశాలల్లో 50 ఏళ్లలోపు పురుష ఉపాధ్యాయులు ఉండకూడదంటూ ప్రభుత్వం ఇటీవల జీఓ విడుదల చేసింది. అలా పని చేస్తున్న స్థానాలను ఖాళీలుగా చూపించారు. అయితే నగరంలోని శారదా బాలికల పాఠశాలకు ఇద్దరు 50 ఏళ్లలోపు సోషల్ పురుష టీచర్లను కేటాయించడం గమనార్హం. వాస్తవానికి నగర పాలక పాఠశాలల్లో మహిళా టీచర్లు ఉన్నారు. వారందరికీ యూపీ పాఠశాలలు, బాలుర ఉన్నత పాఠశాలలు కేటాయించారు. శ్రీపొట్టి శ్రీరాములు పాఠశాలలో పని చేస్తున్న ఇందతుల్లా, జయకృష్ణ తప్పనిసరి బదిలీ కావాల్సి ఉంది. బాలుర పాఠశాలల్లో ఖాళీలు లేకపోవడంతో మొన్నటిదాకా వారు అక్కడే కొనసాగుతూ వచ్చారు. జీతాలకు ఇబ్బంది తలెత్తే ప్రమాదం నెలకొనడంతో రెండు రోజుల కిందట తప్పనిసరి పరిస్థితుల్లో బాలికల పాఠశాలకు కేటాయించారు. అధికారుల అనాలోచిత నిర్ణయం కారణంగానే ఈ దుస్థితి నెలకొందని పలువురు టీచర్లు, సంఘాల నాయకులు మండిపడుతున్నారు.

దళితులకు రక్షణ కల్పించలేరా?



విద్యార్థి, ప్రజాసంఘాల ఐక్యవేదిక నాయకులు కలెక్టరేట్‌లోకి వెళ్లకుండా అడ్డుకుంటున్న పోలీసులు

- కదం తొక్కిన విద్యార్థి, ప్రజాసంఘాల ఐక్యవేదిక నాయకులు
- ఉద్రిక్తతకు దారి తీసిన కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమం

అనంతపురం అర్బన్: దళిత, గిరిజన మహిళలు, మైనర్ బాలికలకు రక్షణ కల్పించడంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలం చెందిందని విద్యార్థి, ప్రజాసంఘాల ఐక్యవేదిక నాయకులు ధ్వజమెత్తారు. అత్యాచారాలు, దాడులు, లైంగిక వేధింపులకు అడ్డుకట్ట వేయరా అంటూ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. విద్యార్థి, ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో బుధవారం చేపట్టిన కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమం ఉద్రిక్తతకు దారితీసింది. రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్దపెట్టున నినాదాలు చేస్తూ నాయకులు, కార్యకర్తలు అనంతపురం సంగమేష్ సర్కిల్ నుంచి ప్రదర్శనగా వచ్చి కలెక్టరేట్ ముట్టడికి యత్నించారు. కార్యాలయ ద్వారం వద్ద అడ్డుగా ఉంచిన స్టాపర్లను తోసుకుని వెళ్లే ప్రయత్నం చేశారు. అప్పటికే భారీగా మోహరించిన పోలీసులు ఆందోళనకారులను అడ్డుకోవడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఈ సందర్భంగా నాయకులు మీడియాతో మాట్లాడుతూ ఉమ్మడి అనంతపురం జిల్లాలో దళిత, గిరిజన మహిళలు, మైనర్ బాలికలపై అకృత్యాలను అరికట్టడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధితులకు న్యాయం చేయడంలోనూ నిర్లక్ష్యం వహిస్తున్నారని మండిపడ్డారు. రామగిరి మండలం ఏడుగుర్రాలపల్లిలో మైనర్ బాలికపై జరిగిన అమానవీయ ఘటన,నగరంలోని రామ కృష్ణ కాలనీకి చెందిన ఇంటర్ విద్యార్థిని తన్మయి హత్య ఘటన ప్రభుత్వ వైఫలానికి నిదర్శనమన్నారు. బాధిత కుటుంబాలను కనీసం ఎమ్మెల్యేలు, మంత్రులు పరామర్శించకపోవడం చూస్తే దళితులు, మహిళల విషయంలో ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణి స్పష్టమవుతోందని విమర్శించారు. ప్రభుత్వం తక్షణమే ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటు చేసి నెల రోజుల్లో కేసు విచారణ పూర్తి చేసి దుండగులను కఠినంగా శిక్షించడంతో పాటు బాధితులకు న్యాయం చేయాలన్నారు. అనంతరం జేసీ శివ్ నారాయణ్ శర్మకు నాయకులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాము, ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి సురేష్, రాయలసీమ విద్యావంతుల వేదిక వెంకటేష్, ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ సాకే హరి, సామాజిక న్యాయ వేదిక కుల్లాయప్ప, సీఎల్‌సీ ఆదినారాయణ, ఐఎఫ్‌టీయూ ఏసురత్నం, దావీదు, నిరుద్యోగ ఐక్యవేదిక రామన్న, పీపీఎస్ వీరనారప్ప, ప్రజాకళామండలి విజయ్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న బది'లీలల' పరంపర

అనంతపురం అర్బన్: రెవెన్యూలో బది'లీలల' పరంపర కొనసాగుతోంది. అది కూడా పాత తేదీతో ప్రక్రియను సాగిస్తుండడం సర్వత్రా విమర్శలకు దారి తీస్తోంది. 'ఈ నెల 9వ తేదీ'ని ఉత్తర్వుల్లో పొందుపరిచి తాజాగా మరో నలుగురికి తహసీల్దార్లకు స్థాన చలనం కల్పించడం ప్రాధాన్యత సంతరించుకుంది. జిల్లాలో తొలుత 8 మంది తహసీల్దార్లను బదిలీ చేస్తూ ఈనెల 4న ఉత్తర్వులు ఇచ్చారు. అటు తరువాత ఇద్దరు తహసీల్దార్లకు స్థాన చలనం కల్పిస్తూ 9వ తేదీన ఉత్తర్వులు విడుదలయ్యాయి. మళ్లీ ఈ నెల 14వ తేదీన గతంలో ఏడుగురు తహసీల్దార్లకు ఇచ్చిన స్థానాలను మార్పు చేస్తూ ఆదేశాలిచ్చారు. అయితే, బదిలీలకు సంబంధించి ప్రభుత్వం విధించిన గడువు తేదీ జూన్ 9ని ఆ ఉత్తర్వుల్లో పొందుపరచడం చర్చనీయాంశమైంది. తాజాగా 9వ తేదీపైనే మరోసారి స్థానాలు మార్పు చేస్తూ ఉత్తర్వులు విడుదల చేయడం గమనార్హం.

మార్చారిలా...

- జి.పుణ్యవతి- బుక్కరాయసముద్రం తహసీల్దారుగా ఉన్న ఈమెను తొలుత పుట్లూరు తహసీల్దారుగా బదిలీ చేశారు. తిరిగి బుక్కరాయసముద్రం తహసీల్దారుగా నియమించారు. తాజాగా గుత్తి తహసీల్దారుగా పంపారు.
- జి.శ్రీధర్ మూర్తి- పామిడి తహసీల్దారుగా ఉన్న ఈయనను కలెక్టరేట్ కో-ఆర్డినేషన్ విభాగం సూపరింటెండెంట్‌గా నియమించారు. తాజాగా ఈయనకు బుక్కరాయసముద్రం తహసీల్దారుగా పోస్టింగ్ ఇచ్చారు.
- ఎస్.యుగేశ్వరిదేవి- కలెక్టరేట్ కో-ఆర్డినేషన్ విభాగం సూపరింటెండెంట్‌గా ఉన్న ఈమెను డి.హీరేహాళ్ తహసీల్దారుగా నియమించారు. అటు తరువాత పెద్దవడుగూరు తహసీల్దారుగా పోస్టింగ్ ఇచ్చారు. తాజాగా పాతస్థానం కో-ఆర్డినేషన్ విభాగం సూపరింటెండెంట్‌గానే నియమించారు.

కూటమి నేతల బాహాబాహీ

- సీకేపల్లి ధాబాలో ఇరు వర్గాల ఘర్షణ
- 'పరిటాల' అనుచరులపై కత్తితో దాడి చేసిన సూరి అనుచరుడు
- ప్రతిదాడిగా రాళ్లతో రణరంగం సృష్టించిన పరిటాల వర్గం



దాడిలో గాయపడిన అరవింద్‌రెడ్డి

సాక్షి టాస్క్‌ఫోర్స్: చెన్నేకొత్తపల్లిలోని ఓ ధాబాలో కూటమి నేతలు బాహాబాహీకి దిగారు. ఓ వర్గం నాయకుడు కత్తితో దాడి చేయగా...మరోవర్గం వారు రాళ్లదాడితో రణరంగం సృష్టించారు. ఈ ఘటన బుధవారం స్థానికంగా తీవ్ర ఉద్రిక్తతకు దారి తీసింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు..ఎన్ఎస్‌గేట్‌కు చెందిన ఖాసీంవలి, నాగరాజు పరిటాల శ్రీరామ్ అనుచరులు. వీరిద్దరూ బుధవారం సీకే పల్లి జాతీయ రహదారి పక్కన ఉన్న ఓ ధాబాలో కూర్చుని ఉన్నారు. అదే సమయంలో ధర్మవరం మండలం చిగిచెర్లకు చెందిన అరవింద్‌రెడ్డితో పాటు మరికొందరు టీ తాగేందుకు అదే ధాబాకు వచ్చారు.అరవింద్‌రెడ్డి గతంలో వరదాపురం సూరి ప్రధాన అనుచరుడిగా ఉన్నాడు. ఈ క్రమంలో పరిటాల శ్రీరామ్ అనుచరులు ఖాసీంవలి, నాగరాజు ధర్మవరం రాజకీయాలపై మాట్లాడుకుంటుండగా... అరవింద్‌రెడ్డి కలుగజేసుకున్నాడు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య మాటామాటా పెరిగి... ఒకరిపై మరొకరు దాడికి దిగారు.దీంతో అరవింద్‌రెడ్డి వంటగదిలోకి వెళ్లి కత్తి తీసుకుని వచ్చి ఖాసీంవలి, నాగరాజుపై దాడి చేశాడు. వారిద్దరూ రాళ్లతో అరవిందరెడ్డిపై ప్రతిదాడి చేశారు. ఈ ఘటనలో ఇరువర్గాల వారు గాయపడ్డారు. స్పందించిన స్థానికులు క్షతగాత్రులను సమీపంలోని చెన్నేకొత్తపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి తీసుకెళ్లారు. ప్రస్తుతం నాగరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని, అరవింద్‌రెడ్డి ఫిర్యాదు అందిన వెంటనే ఇరువర్గాలపై కేసు నమోదు చేస్తామని చెన్నేకొత్తపల్లి ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు.

మావాళ్లొస్తారు.. మీరెళ్లిపోండి!

- సెక్యూరిటీ ఏజెన్సీకి కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అనుచరుల బెదిరింపులు
- ఆందోళన వ్యక్తం చేస్తున్న చిరుద్యోగులు

కళ్యాణదుర్గం: 'మా వాళ్లు చాలా మంది ఉన్నారు... మీరెళ్లిపోండి... వారు విధుల్లోకి వస్తారు' అంటూ కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు అనుచరులు ఎట్రియా బ్రైట్ విండ్ పార్క్ సెక్యూరిటీ సిబ్బందిపై బెదిరింపులకు దిగిన విషయం సర్వత్రా చర్చనీయాంశమైంది. మూడు రోజుల క్రితం చోటుచేసుకున్న ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలు.. కళ్యాణదుర్గం ప్రాంతంలోని గాలిమరల వద్ద ఎట్రియా బ్రైట్ విండ్ పార్క్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ కింద సెక్యూరిటీ, సూపర్‌వైజర్లు, ఐటీ ఎక్స్‌పర్ట్‌లు సుమారు 70 మంది విధులు నిర్వర్తిస్తున్నారు. కళ్యాణదుర్గం మండలంలోని ఐదుకల్లు గ్రామ సమీపంలో 'ఎట్రియా' కార్యాలయం ఏర్పాటు చేశారు. ఈ సంస్థకు ఇంకా రెండున్నరేళ్ల పాటు అనుమతులు ఉన్నాయి. అంతవరకూ సిబ్బంది కొనసాగాల్సి ఉంది. అయితే మూడు రోజుల క్రితం అభయ్ సెక్యూరిటీ ఏజెన్సీ పేరుతో ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు అనుచరులు కొందరు ఐదుకల్లు 'ఎట్రియా' కార్యాలయానికి వెళ్లారు. సిబ్బందిని బయటికి పంపి కార్యాలయ గేటుకు తాళాలు వేశారు. 'మా పార్టీ అధికారంలో ఉంది.. ఇకపై మా వారే విధులకు వస్తారు' అంటూ భయభ్రాంతులకు గురి చేశారు. కాగా.. గాలిమరల కంపెనీలో సెక్యూరిటీ సిబ్బంది విషయంపై మాజీ ఎమ్మెల్యే ఉన్నం హనుమంతరాయ చౌదరి, ప్రస్తుత ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబుల మధ్య కోల్డ్ వార్ నడుస్తున్నట్లు సమాచారం. ఉన్నం తనయులు ఎట్రియా బ్రైట్ విండ్ పార్క్ సంస్థ ద్వారా సిబ్బందిని నియమించుకున్నారు.దీన్ని తట్టుకోలేని అమిలినేని అనుచర గణం.. ఏకంగా కార్యాలయానికే వెళ్లి బెదిరింపులకు దిగడం నియోజకవర్గంలో హాట్ టాపిక్‌గా మారింది. ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేల మధ్య సమస్యలుంటే ఇద్దరూ సమన్వయంతో పరిష్కరించుకోవాలి కానీ చిరుజీవుల కడుపు కొట్టేలా వ్యవహరించడమేంటని పలువురు విమర్శలు గుప్పిస్తున్నారు.



ఐదుకల్లు సమీపంలో ఏర్పాటు చేసిన ఎట్రియా బ్రైట్ విండ్ పార్క్ కంపెనీ కార్యాలయం

ఎమ్మెల్యే చొరవ చూపాలి

కళ్యాణదుర్గం ప్రాంతంలో 20 ఏళ్లుగా కంపెనీ తరఫున 70 మంది సిబ్బంది పనిచేస్తున్నారు. మూడు రోజుల క్రితం ఎమ్మెల్యే అమిలినేని అనుచరులు కార్యాలయానికి వచ్చి సిబ్బందిని బెదిరించారు. మా పార్టీ అధికారంలో ఉంది.. మా వారే విధులకు వస్తారంటూ అభయ్ సెక్యూరిటీ ఏజెన్సీ పేరు చెప్పి కొందరు హల్‌చల్ చేశారు. చిన్నా చితకా ఉద్యోగాలు చేసుకునే వారి పొట్ట కొట్టడం సరి కాదు. దీనిపై స్థానిక ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు చొరవ చూపి, సిబ్బందికి న్యాయం చేయాలి.

– సుధీర్, సూపర్‌వైజర్, ఎట్రియా బ్రైట్ విండ్ పార్క్

క్లుప్తంగా

రైతులకు రాయితీ పనిముట్ల పంపిణీ



రైతులకు రాయితీ చెక్కు అందజేస్తున్న ఎంపీ లక్ష్మీనారాయణ, జేసీ శివ్‌నారాయణ్ శర్మ

అనంతపురం సిటీ: రాయితీతో అందజేస్తున్న యంత్ర పనిముట్లను సద్వినియోగం చేసుకోవాలని రైతులను అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ కోరారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో వ్యవసాయ యంత్రీకరణ పథకం కింద మంజూరైన వ్యవసాయ యంత్ర పరికరాలను కలెక్టరేట్‌లో బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా 1,070 మంది రైతులకు వర్తించిన రాయితీకి సంబంధించిన రూ.2.29 కోట్ల చెక్కును ఆయన అందజేసి, మాట్లాడారు. చిన్న, సన్నకారు రైతులకు వ్యక్తిగతంగా 50 శాతం సబ్సిడీతో వివిధ రకాల వ్యవసాయ పనిముట్ల అందజేస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ శివ్‌నారాయణ్ శర్మ తెలిపారు. ఇందుకు సంబంధించి జిల్లాలో 1,070 మంది రైతులకు 50 శాతం సబ్సిడీతో రాయితీ విడుదలైందన్నారు. డీఏఓ ఉమామహేశ్వరమ్మ, జెడ్పీ సీఈఓ శివశంకర్, ఆగ్రోస్ ఎండీ ఓబుళపతి, వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

దుర్మార్గపు పాలనకు బుద్ధి చెబుతాం

- వైఎస్సార్ సీపీ టాస్క్‌ఫోర్స్ సభ్యుడు రమేష్‌గౌడ్



అనంతపురం కార్పొరేషన్: కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెప్పే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని వైఎస్సార్‌సీపీ టాస్క్ ఫోర్స్ సభ్యుడు, రాష్ట్ర కార్యదర్శి రమేష్‌గౌడ్ ధ్వజమెత్తారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సత్తెనపల్లి పర్యటనను విఫలం చేసేందుకు అభిమానులు, ప్రజలను అడ్డుకోవడం దుర్మార్గమన్నారు. కూటమి ప్రభుత్వ కనుసన్నల్లోనే పోలీసులు పనిచేస్తూ ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. జననేత నుంచి జనాన్ని దూరం చేయాలనుకుంటే అరచేతిని అడ్డుపెట్టి సూర్యుణ్ని ఆపడంలాంటిదేనన్నారు. సీఎం చంద్రబాబుకు ఎలాంటి ప్రజాదరణ లేదన్నారు. అధికారంలో లేకపోయినా ప్రజల పక్షాన నిలుస్తూ, ప్రజా సంక్షేమమే పరమావధిగా ముందుకు నడుస్తున్న జగనన్నకు వస్తున్న ఆదరణను ఓర్వలేక చంద్రబాబు అండ్ కో దిగుజారుడు రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు.

సాంకేతిక సాకు.. తిరకాసు

అనంతపురంలోని తపోవనంలో నివాసముంటున్న దామోదరరెడ్డి ఇటీవల 4 సెంట్ల స్థలాన్ని కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు రామ్‌నగర్‌లోని ఓ డాక్యుమెంట్ రైటర్‌ని కలిశాడు. అతను స్టాంప్ వెండర్ దగ్గరకు పిలుచుకెళ్లి స్టాంపులు కావాలని అడిగితే స్థలం విలువలో 6.5శాతం స్టాంప్ డ్యూటీని స్టాక్ హోల్డ్ ఏజెన్సీ పేరిట చలానా తీస్తే ఈ–స్టాంపు ఇస్తామన్నాడు. దీంతో ఏజెన్సీ పేరిట చలానా తీసే సమయంలో ఖాతాలో నగదు కట్ అయింది కానీ, చలానా రాకుండా హోల్డ్‌లోకి వెళ్లింది. దీంతో దాదాపు రూ.40వేలకు పైగా నగదు అలాగే నిలిచిపోయింది.

అనంతపురం టౌన్: భూములు రిజిస్ట్రేషన్ చేసుకునే సమయంలో స్థలం విలువలో స్టాంప్ డ్యూటీ కింద 6.5శాతం, రిజిస్ట్రేషన్ ఫీజు 1 శాతం, యూజర్ ఛార్జీల కింద రూ.550 చెల్లించాల్సి ఉంది. ఈ మొత్తాలన్నింటినీ స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖకు చలానా రూపంలో వినియోగదారులు చెల్లించాలి. అయితే ప్రస్తుతం నాన్ జ్యుడిషియల్ స్టాంపులు అందుబాటులో లేకపోవడంతో ప్రైవేట్ ఏజెన్సీకి అప్పగించిన ఈ–స్టాంపుల విక్రయాలు ఊపందుకున్నాయి. ఈ సాంకేతిక సాకును తమకు అనుకూలంగా మార్చుకున్న ఏజెన్సీ నిర్వాహకులు తిరకాసులు పెడుతూ స్టాంపు వెండర్లకు ఈ–స్టాంపుల స్టాక్ ఇవ్వకుండా అడ్డుకుంటున్నారు. స్టాంప్ డ్యూటీ మొత్తాన్ని స్టాక్ హోల్డ్ ఏజెన్సీ, భూపాళం కాంప్లెక్స్, కర్నూలు పేరిట చలానా తీస్తేనే ఈ–స్టాంపులు ఇస్తామని వెండర్లకు మెలిక పెడుతున్నారు. ఏజెన్సీ పేరుతో చలానా తీసే సమయంలో ఖాతాలోని నగదు హోల్డ్ పడితే ఎవ్వరిని అడగాలి? ఖాతా నుంచి కట్ అయిన నగదు తిరిగి ఖాతాలో జమ అవుతుందా? వీటికి స్టాక్ హోల్డ్ ఏజెన్సీ నుంచి ఎలాంటి స్పష్టత లేదు.

ఒక్కరికే ఈ–స్టాంపులు

రామ్‌నగర్ రిజిస్ట్రేషన్ కార్యాలయ సమీపంలోని ఓ కస్టమర్ సర్వీస్ సెంటర్ నిర్వాహకుడికి మాత్రమే అ. దీకృత ఈ–స్టాంప్‌లను కర్నూలులోని స్టాక్ హోల్డ్ ఏజెన్సీ నిర్వాహకులు అందిస్తున్నారు. దీంతో ఈ–స్టాంపుల కోసం సీఎస్‌సీ కేంద్రం వద్ద గంటల తరబడి క్యూలైన్‌లో వేచి ఉండాల్సి వస్తోంది. వినియోగదారుల అవసరాలను ఆసరాగా చేసుకుని సదరు కేంద్రం నిర్వాహకుడు అధిక ధరకు ఈ–స్టాంప్‌లు విక్రయిస్తున్నట్లుగా ఆరోపణ లున్నాయి. రూ.100 విలువ చేసే స్టాంపును రూ.150 నుంచి రూ.180 వరకు అవసరాన్ని బట్టి నగదు చెల్లించి కొనుగోలు చేయాల్సిన దుస్థితి నెలకొంది. రూ.50 విలువ చేసే ఈ–స్టాంప్‌ను రాప్తాడుకు చెందిన ఓ వ్యక్తి రెట్టింపు ధరతో కొనుగోలు చేశాడంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

- స్టాంప్ వెండర్లను ఇబ్బందులకు గురి చేస్తున్న స్టాక్ హోల్డ్ ఏజెన్సీ
- ఏజెన్సీ పేరిట చలానా తీస్తేనే ఈ–స్టాంపులంటూ మెలిక
- చలానా తీసే సమయంలో నగదు హోల్డ్‌లో పడి నష్టపోతున్న వినియోగదారులు
- నగరంలో కేవలం ఒకరికే స్టాంపుల సరఫరా
- దందాకు తెరలేపిన సదరు స్టాంప్ వెండర్
- పట్టించుకోని స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ



స్టాంపుల కోసం వేచి ఉన్న వినియోగదారులు

పట్టించుకోని అధికారులు:

ఈ–స్టాంపుల అధిక ధర విక్రయాలను అడ్డుకోవాల్సిన స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు చోద్యం చూస్తున్నారు. దీంతో స్టాంప్‌ల విక్రయదారులు ఆడిందే ఆట... పాడిందే పాటగా వ్యవహరిస్తూ వినియోగదారులను దోచుకుంటున్నారు. నగరంలో ఒక్కరికే ఈ–స్టాంప్‌ల విక్రయానికి అనుమతులు ఇవ్వడంతో ఆయన చెప్పిందే ధరగా మారింది. లేదంటే స్టాంపులు లేవంటూ నిర్లక్ష్యంగా వెనక్కు పంపించేస్తాడు. స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ కార్యాలయంలోని స్టాంపుల విక్రయ కేంద్రాన్ని మూసి ఇప్పటికే ఏడాది కావస్తోంది. దీంతో స్టాంపుల కోసం అధిక మొత్తంలో చెల్లించాల్సిన పరిస్థితి నెలకొంది.

చర్యలు తీసుకుంటాం



స్టాక్ హోల్డ్ కార్పొరేషన్ ఏజెన్సీ నుంచి జిల్లాలోని స్టాంప్ వెండర్లందరికీ స్టాంపులు సరఫరా చేసేలా చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే జిల్లాలో నెలకొన్న స్టాంపుల కొరత సమస్యపై ఉన్నతాధికారులతో చర్చించాం. అన్ని రకాల స్టాంపులను రిజిస్ట్రేషన్ కార్యాలయంలో అందుబాటులోకి తీసుకువస్తాం. – భార్గవ్, జిల్లా రిజిస్ట్రార్

రాష్ట్రస్థాయి యోగాంధ్ర పోటీల్లో జిల్లా వాసుల ప్రతిభ



బహుమతులు అందుకున్న జిల్లావాసులు

అనంతపురం అర్బన్: ఈనెల 16, 17 తేదీల్లో విజయవాడ వేదికగా నిర్వహించిన యోగాంధ్ర రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లావాసులు వివిధ విభాగాల్లో ప్రతిభ చూపారు. తుమ్మలపల్లి కళాక్షేత్రంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ చేతుల మీదుగా బహుమతులు అందుకున్నారు. పోటీల్లో గెలుపొందిన వారికి కలెక్టర్ వి.వినోద్‌కుమార్ అభినందనలు తెలిపారు. వ్యాసరచన పోటీల్లో నగరానికి చెందిన బి.భావన రసజ్ఞ ప్రథమ బహుమతి సాధించారు. సోలో యోగా పోటీల్లో (35 ఏళ్ల ఆపై) నగరానికి చెందిన ఎం.చలపతి రెండో బహుమతి గెలుచుకున్నారు. షార్ట్ ఫిలిమ్ పోటీల్లో (35 ఏళ్ల ఆపై) గుత్తికి చెందిన సి.విజయభాస్కర్ చౌదరి ద్వితీయ బహుమతి సాధించారు. పోస్టర్ పోటీల్లో (35ఏళ్ల ఆపై) ఉరవకొండకు చెందిన కె.సునీత మూడో బహుమతి దక్కించుకున్నారు. యోగా షార్ట్ ఫిలిమ్ పోటీల్లో (10–18 ఏళ్ల మధ్య) ఉరవకొండకు చెందిన కె.భరణి రెండో బహుమతి, యోగా క్విజ్ పోటీల్లో (19–35 ఏళ్లు) నగరానికి చెందిన బి.భావన రసజ్ఞ, బి.సాయి చంద్రశేఖర్ (ఉరవకొండ), కె.రుషిత తన్మయి తృతీయ బహుమతి గెలుపొందారు.

పందుల అపహరణ

కనగానపల్లి: మండలంలోని దాదులూరు సమీపంలో 44వ జాతీయ రహదారిపై పందులను తరలిస్తున్న వాహనాన్ని దుండగులు అడ్డుకుని పందులను మరో వాహనంలో అపహరించారు. పోలీసులు తెలిపిన మేరకు... తెలంగాణలోని వికారాబాద్ జిల్లా దరూర్ మండలం నాగిరెడ్డిపల్లికి చెందిన ఎరికల రామకృష్ణ, బసవరాజు, వెంకటేష్ ఓ బొలెరో వాహనంలో మంగళవారం రాత్రి 89 పందులను కర్ణాటకలోని చిక్కబళ్లాపూర్ సమీపంలోని పేరసంద్రకు తీసుకెళుతున్నారు. వెంబడిస్తూ వచ్చిన మరో వాహనంలోని 15 మంది దుండగులు దాదులూరు సమీపంలోకి చేరుకోగానే బొలెరో వాహనాన్ని అడ్డుకున్నారు. అనంతరం పందుల యజమానులను బెదిరించి 89 పందులను అపహరించుకెళ్లారు. ఘటనపై బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

యువకుడి బలవన్మరణం

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలోని హైస్కూల్ కొట్టాలకు చెందిన సంగమేష్ కుమారుడు శివాజీ (22) ఆత్మహత్య చేసుకున్నాడు. డిగ్రీ పూర్తి చేసినా.. తనకు ఉద్యోగం రాలేదన్న మనోవేదనతో బుధవారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ఆర్ట్స్ కళాశాలలో డిగ్రీ అడ్మిషన్ల హెల్ప్‌డెస్క్ ఏర్పాటు



అనంతపురం ఎడ్యుకేషన్: డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాల ప్రక్రియపై విద్యార్థుల అవగాహన కోసం అనంతపురంలోని ఆర్ట్స్ కళాశాలలో ప్రత్యేకంగా హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశారు. ఈ మేరకు ఆ కళాశాల ప్రిన్సిపాల్ పద్మశ్రీ బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 19 నుంచి అడ్మిషన్ల ప్రక్రియ ముగిసే వరకూ రోజూ ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు హెల్ప్‌డెస్క్ అందుబాటులో ఉంటుంది. నూతన విద్యా విధానాన్ని అనుసరించి ఈ విద్యా సంవత్సరంలో ఆర్ట్స్ కళాశాలలో 41 డబుల్ మేజర్ కోర్సులను ప్రవేశపెట్టారు.

మొన్నటి వరకూ ఇద్దరు... నేడు ఒక్కరు!

- విద్యాశాఖ ఉద్యోగుల నిర్లక్ష్యంతో భర్తీ కాని రెండో టీచర్ పోస్టు
- టీచర్లు కోరుకునే ప్రయత్నం చేసినా సాకులు చెప్పి తప్పించుకున్న వైనం

అనంతపురం ఎడ్యుకేషన్: ఆ స్కూల్‌లో చదువుతున్న పిల్లలందరూ బీసీ, ఎస్సీ వర్గాలకు చెందిన వారే. వాస్తవానికి అక్కడ రెండు ఎస్జీటీ పోస్టులు మంజూరయ్యాయి. మొన్నటిదాకా ఇద్దరు టీచర్లు పని చేశారు. వారికి 8 ఏళ్ల సర్వీస్ కావడంతో తప్పనిసరి మరోచోటుకు బదిలీ అయ్యారు. అయితే ఉపాధ్యాయ బదిలీల కౌన్సెలింగ్‌లో ఆ స్కూల్‌కు ఒక టీచరును మాత్రమే కేటాయించారు. మరొక టీచరు విషయాన్ని పట్టించుకోలేదు. ఇది విద్యాశాఖ ఉద్యోగులు కావాలనే చేసిన తప్పిదంతో తాడిపత్రి మండలం యర్రగుంటపల్లి బీసీకాలనీలోని పాఠశాల ఏకోపాధ్యాయుడితోనే కొనసాగించాల్సి వచ్చింది.



యర్రగుంటపల్లి బీసీ కాలనీ పాఠశాల

విద్యార్థుల సంఖ్య ఎక్కువే

యర్రగుంటపల్లిలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో 1 నుంచి 5వ తరగతి వరకు 25 మంది విద్యార్థులు ఉన్నారు. నిబంధనల ప్రకారం 20 మంది విద్యార్థుల సంఖ్య దాటితే రెండో ఉపాధ్యాయుడు తప్పనిసరి. ఇక్కడ పని చేస్తున్న ఇద్దరు టీచర్లూ బదిలీల్లో భాగంగా మరో ప్రాంతానికి వెళ్లారు. దీంతో పుట్లూరు–2 పాఠశాల నుంచి ఎన్పీ శివశంకరయ్య బదిలీపై వచ్చారు. మరో పోస్టు ఖాళీగా ఉందని డిస్‌ప్లే చూపించింది. పలువురు టీచర్లు ఈ స్కూల్ కోరుకోవాలని చూసినా...డీఈఓ కార్యాలయ సిబ్బంది కల్పించుకుని అక్కడ పోస్టు లేదని, తీసుకున్నా జీతానికి ఇబ్బంది పడతారంటూ భయపెట్టారు. ఇంకొందరికైతే అప్పటికే మాధవి అనే టీచరు అక్కడికి వెళ్లారని, మరో టీచరుకు ఆ ప్లేస్ ప్రిఫరెన్షియల్ కేటగిరీకి కేటాయించామని బుకాయిస్తూ వచ్చారు. వాస్తవానికి ప్రాథమిక పాఠశాల్లో రెండు పోస్టులున్న చోట ప్రిఫరెన్షియల్ కేటగిరీకి చోటు లేదనే విషయాన్ని మభ్య పెట్టి ఆ స్కూల్‌కు రెండోటీచరు లేకుండా చేశారు. కాగా, ఈ పాఠశాలకు రెండో పోస్టు కేటాయించక పోవడంపై విద్యాశాఖ అధికారికి తాడిపత్రి ఎంఈఓ లేఖ రాశారు.

నువ్వు సీఐ అయితే భయపడాలా?

- రోడ్డుకు అడ్డంగా నిలిపిన కారును తొలగించాలన్న సీఐపై వ్యక్తి దౌర్జన్యం
- కారును స్టేషన్‌కు తరలించాలని చూస్తే వీరంగం
- ఎట్టకేలకు టూటౌన్ పీఎస్‌కు తరలింపు... కేసు నమోదుకు సిద్ధం
- వదిలేయాలంటూ పోలీసులపై ఓ ప్రజాప్రతినిధి ఒత్తిళ్లు



పోలీస్ స్టేషన్‌కు కారును తరలిస్తున్న దృశ్యం

అనంతపురం ఎడ్యుకేషన్: రోడ్డుకు అడ్డంగా నిలిపిన కారును పక్కకు తీయాలని సూచించిన అనంతపురం ట్రాఫిక్ సీఐ వెంకటేష్ నాయక్‌పై కారు యజమాని దౌర్జన్యానికి దిగాడు. 'నువ్వు సీఐ అయితే నేను భయపడాలా?' అంటూ రెచ్చిపోయాడు. ఈ ఘటన బుధవారం రాత్రి సుభాష్ రోడ్డులోని వైఎస్సార్ విగ్రహం సమీపంలో చోటు చేసుకుంది.

నడిరోడ్డుపై ట్రాఫిక్‌కు అంతరాయం

అనంతపురంలోని మారుతీనగర్‌కు చెందిన యాసీన్ అనే వ్యక్తి బుధవారం రాత్రి కారులో వెళుతూ సుభాష్‌రోడ్డులో రోడ్డుపై ఆపేశాడు. దీంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. ఆదే సమయంలో ట్రాఫిక్ సీఐ వెంకటేష్‌నాయక్ అక్కడకు వెళ్లి డ్రైవింగ్ సీటులో కూర్చొన్న యాసీన్‌కు కారును పక్కకు తీయాలని సూచించాడు. నిబంధనలకు వ్యతిరేకంగా ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తూ వాహనాన్ని నిలపడంతో కౌన్సెలింగ్ ఇస్తూ లైసెన్స్ గురించి ఆరా తీశారు. తన వద్ద లేదని, ఇంట్లో ఉందని, మొబైల్‌లో పెట్టించుకుంటానంటూ యాసిన్ బదులిచ్చాడు.

లైసెన్స్ చూపించమంటే రుబాబు

ఎంత సేపటికీ లైసెన్స్‌ను యాసిన్ చూపించకపోవడంతో సీఐ గట్టిగా నిలదీశారు. దీంతో యాసీన్ రెచ్చిపోయాడు. సీఐపై తిరబడ్డాడు. లైసెన్స్ చూపించేది లేదు. ఏమి చేసుకుంటావో చేసుకో అంటూ మాటలతో రెచ్చిపోయాడు. అక్కడే ఉన్న ట్రాఫిక్ కానిస్టేబుళ్లు కల్పించుకుని సదరు కారును పోలీస్‌స్టేషన్‌కు తరలించే ప్రయత్నం చేయగా వారితో దురుసుగా వ్యవహరించాడు. చివరకు పోలీస్ క్రేన్ వాహనాన్ని తెప్పించి కారును తరలించే ప్రయత్నం చేయడంతో మరో వ్యక్తి కల్పించుకుని తానే తీసుకొస్తానంటూ కారును స్టేషన్ వద్దకు తీసుకెళ్లారు. ఇంతలో సమాచారం అందుకున్న టూటౌన్ పోలీసులు అక్కడికి చేరుకుని యాసిన్‌ను అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

రాజకీయ ఒత్తిళ్లు..

నడిరోడ్డుపై జరిగిన వాగ్వాదం, కారును స్టేషన్‌కు తరలించిన విషయం కాస్త ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో కేసు నమోదు చేసి కౌన్సెలింగ్ ఇవ్వాలని ఆదేశించినట్లు తెలిసింది. ఇంతలో సమాచారం అందుకున్న అధికార పార్టీకి చెందిన ఓ ముఖ్య ప్రజాప్రతినిధి ఎలాంటి కేసు నమోదు చేయొద్దని, సదరు వ్యక్తిని వదిలేయాలంటూ తీవ్రస్థాయిలో ఒత్తిళ్లు చేసినట్లు సమాచారం. కాగా, ప్రజలందరూ చూస్తుండగా సామాన్య వ్యక్తి సాగించిన దౌర్జన్యాన్ని తీవ్ర అవమానంగా భావించిన పోలీసులు ఆ ప్రజాప్రతినిధి మాటలను పట్టించుకోకుండా కేసు నమోదుకే మొగ్గు చూపుతున్నారు. ఇదే అంశంపై రెండో పట్టణ సీఐ శ్రీకాంత్ మాట్లాడుతూ.. 'ట్రాఫిక్‌లో ఇబ్బందులకు గురి చేసిన యాసిన్‌కు నోటీసు ఇచ్చి పంపాం. తర్వాత కేసు నమోదు చేస్తాం' అని తెలిపారు.

ఇంటి దొంగ గుట్టురట్టు

- కాపర్ వైర్‌పై కన్నేసిన కన్నింగ్ లైన్‌మెన్
- దాదాపు 300 మీటర్ల కాపర్ వైర్ అపహరణ.. విక్రయం
- అక్రమాలపై విచారణ చేపడతామన్న విద్యుత్ శాఖ ఏడీ



కణేకల్లు: విద్యుత్ సబ్ స్టేషన్‌లో పనిచేస్తున్న ఓ లైన్‌మెన్ కాపర్‌వైర్‌పై కన్నేశాడు. గుట్టుచప్పుడు కాకుండా కాపర్‌వైర్‌ను అపహరించి బహిరంగ మార్కెట్‌లో విక్రయించి సొమ్ము చేసుకున్నాడు. ఈ అక్రమాలు కాస్త వెలుగు చూడడంతో విచారణకు ఆ శాఖ అధికారులు రంగం సిద్ధం చేశారు. వివరాల్లోకి వెళితే.. కొన్నేళ్ల క్రితం కణేకల్లులోని వివిధ కాలనీలో కరెంటు సరఫరా కోసం విద్యుత్ స్తంభాలంపై కాపర్ వైర్‌తో లైన్‌లు ఏర్పాటు చేశారు. ఈ కాపర్ వైర్‌పై కన్నేసిన లైన్‌మెన్ ఉన్నతాధికారులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా వాటిని తొలగించి, సిల్వర్ వైర్ లాగాడు. కణేకల్లులోని వివిధ ప్రాంతాల్లో 9 స్తంభాలకు ఏర్పాటు చేసిన సుమారు 300 మీటర్లు అంటే సుమారు 120 కిలోల కాపర్ వైర్ మాయమైనట్లు సమాచారం. వీటి విలువ రూ.72 వేలు ఉంటుందని అంచనా.

ఎల్‌సీ ఎలా తీసుకొన్నాడు?

కాపర్ వైర్ లైన్ మార్పిడి పనులు తమకు తెలియకుండా జరిగాయని లైన్ ఇన్‌స్పెక్టర్‌తో పాటు ఏఈ సైతం పేర్కొనడం గమనార్హం. లైన్ మార్పిడి చేయాలంటే తొలుత ప్రతిపాదనలు సిద్ధం చేయాలి. ఆ తర్వాత మెటీరియల్ వస్తే అధికారుల ఆదేశాల మేరకు పనులు చేయాల్సి ఉంది. అయితే ఉన్నతాధికారులకు ఎంత మాత్రం తెలియకుండా ఓ లైన్‌మెన్ ఇంతటి సాహసానికి ఒడిగట్టడం వెనుక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కాపర్ వైర్ లైన్ మార్పిడి సమయంలో ఎల్‌సీ ఎలా తీసుకొన్నాడు? పనులెప్పుడు చేశాడనేది మిలియన్‌డాలర్ల ప్రశ్నగా మారింది.

ఎంఎస్ మీటర్ మార్పిడికీ డబ్బు వసూలు

ఎంఎస్ మీటర్ (మీటర్ స్టకప్ మీటర్) మార్పిడి అంశంలో మామూళ్ల వసూళ్లకు సదరు లైన్‌మెన్ తెరలేపినట్లు ప్రజలు ఆరోపిస్తున్నారు. ఒక వేళ మీటర్లు కాలిపోతే వినియోగదారుడు డిపార్ట్‌మెంటుకు రూ.1,050 చెల్లించి కొత్త మీటర్ పొందాల్సి ఉంటుంది. అలా కాకుండా చెడిపోయినా, రీడింగ్ రన్నింగ్ కాకపోయినా వాటి స్థానంలో మరొకటి ఏర్పాటు చేయడానికి విద్యుత్ శాఖ ఉచితంగా మీటర్లను సరఫరా చేస్తోంది. దీనికి ఎలాంటి చార్జీలు వసూలు చేయరు. ఎంఎస్ మీటర్లను ఉచితంగా మార్చాల్సి ఉండగా... సదరు లైన్‌మెన్ వినియోగదారుల నుంచి రూ.1,500 నుంచి రూ. 2వేల వరకూ వసూలు చేసినట్లు సమాచారం. కణేకల్లులో 50కి పైగా స్టకప్ మీటర్లున్నాయని కొత్త మీటర్లు తీసుకెళ్లిన సదరు లైన్‌మెన్... వినియోగదారులు డబ్బు ఇవ్వకపోవడంతో వాటిని రిప్లేస్ చేయకుండా తన వద్దే ఉంచుకున్నట్లు తెలుస్తోంది.

ఇటీవలే నా దృష్టికి వచ్చింది

కణేకల్లులో కాపర్ వైర్ మాయమైనట్లు ఇటీవలే నా దృష్టికి వచ్చింది. ఈ పని ఎవరు చేశారనే దానిపై విచారణ చేపడతాం. లైన్ మార్పిడి చేస్తే పాత కేబుల్‌ను ఏఈకు అప్పగించాలి. అలా చేయకుండా అమ్మేయడం తప్పు. కాపర్ వైర్ మాయం చేసిన వారిపై శాఖపరమైన చర్యలు తీసుకుంటాం. ఎంఎస్ మీటర్ల రిప్లేస్ అవినీతిపై కూడా విచారణ చేపడతాం. బాధితులెవరైనా ఉంటే నేరుగా ఫిర్యాదు చేయాలి.
– భాస్కర్, విద్యుత్ శాఖ ఏడీ, ఉరవకొండ

కంప్యూటర్ ట్యాలీలో ఉచిత శిక్షణ

అనంతపురం: నగరంలోని రూడ్ సెట్ ఆధ్వర్యంలో కంప్యూటర్ ట్యాలీ కోర్సులో మహిళలకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు. ఈ మేరకు ఆ సంస్థ డైరెక్టర్ విజయలక్ష్మి బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 21 నుంచి 38 రోజుల పాటు శిక్షణ ఉంటుంది. 18 నుంచి 45 ఏళ్లలోపు వయసున్న ఉమ్మడి జిల్లాకు చెందిన గ్రామీణ నిరుద్యోగ మహిళలు అర్హులు. రేషన్, ఆధార్ కార్డులు కలిగి ఉండాలి. శిక్షణా కాలంలో ఉచిత భోజనం, వసతి సౌకర్యాలు కల్పిస్తారు. పూర్తి వివరాలకు 94925 83484లో సంప్రదించవచ్చు.

నలుగురు జీవిత ఖైదీల విడుదల



విడుదలైన ఖైదీలతో జైలు సిబ్బంది

బుక్కరాయసముద్రం: మండలంలోని రెడ్డిపల్లి ఓపెన్ ఎయిర్ జైలు నుంచి నలుగురు జీవిత ఖైదీలు విడుదలయ్యారు. ఈ మేరకు జైలు సూపరింటెండెంట్ రహమాన్ తెలిపారు. సుప్రీంకోర్టు నిబంధనల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా 17 మంది జీవిత ఖైదీలను విడుదల చేస్తూ రాష్ట్ర హోం శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కుమార్ విశ్వజిత్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో ఓపెన్ ఎయిర్ జైలుకు చెందిన నలుగురు ఖైదీలు ఉన్నారు. విడుదలైన వారిలో ప్రకాశం జిల్లా పొన్నలూరు గ్రామానికి చెందిన రామస్వామి, వైఎస్సార్ కడప జిల్లా తొండూరు మండలం గొట్లూరు గ్రామానికి చెందిన పోల్‌రెడ్డి, అదే జిల్లా కడపలోని భగత్‌సింగ్ నగర్‌కు చెందిన ఫక్రుద్దీన్, నెల్లూరులోని జీనిగిల వీధికి చెందిన చంద్రశేఖర్ ఉన్నారు. వీరికి విడుదల ఆర్డర్ కాపీతో పాటు నూతన వస్త్రాలను అందజేసి బుధవారం రాత్రి సాగనంపినట్లు జైలు సూపరింటెండెంట్ రహమాన్ తెలిపారు.

బెంగళూరులో డి.చెన్నేపల్లి వాసి మృతి



మృతుడు సురేంద్ర

కళ్యాణదుర్గం: కంబదూరు మండలం డి.చెన్నేపల్లికి చెందిన రామ్మోహన్ కుమారుడు సురేంద్ర (32) కుటుంబకలహాలతో విసుగు చెంది బెంగుళూరులో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. పదేళ్లుగా వీరి కుటుంబం హిందూపురంలో స్థిరపడినట్లు సమాచారం.

సజావుగా ఏఎన్ఎంల బదిలీల కౌన్సెలింగ్



అనంతపురం మెడికల్: డీఎంహెచ్ఓ కార్యాలయంలో బుధవారం చేపట్టిన ఏఎన్ఎంల బదిలీల కౌన్సెలింగ్ ప్రక్రియ సజావుగా సాగింది. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్న 122 మందికి వారు కోరుకున్న ప్రాంతాలకు సీనియారిటీ ప్రాతిపదికన డీఎంహెచ్ఓ డాక్టర్ భ్రమరాంబదేవి బదిలీ చేశారు. ఏఓ గిరిజాకుమార్, సీనియర్ అసిస్టెంట్ కమలాకర్‌రాజు పాల్గొన్నారు.

యోగాంధ్ర పేరుతో దోపిడీ



ఆర్‌ఓబీ వద్ద జరుగుతున్న ఆర్ట్ పనులు



- ఈ ఫొటోలను చూడండి. టవర్‌క్లాక్ ఆర్‌ఓబీ అండర్ పాస్ వద్ద జరుగుతున్న ఆర్ట్ పనులు ఇవి. ఇక్కడ బొమ్మలను చిన్నగా ఆకృతి సరిగా లేకుండా బొమ్మలను వేశారు.
- సూర్య నమస్కారాల పేరుతో బొమ్మను పెద్దగా వేశారు. దీని ఆకారం ఏంటో తెలియని పరిస్థితి. వాస్తవంగా కాన్సెప్ట్ ఆర్ట్ పెయింటింగ్ వేయాలి. కానీ ఇక్కడ అటువంటి పరిస్థితి కనిపించడం లేదు. ఆర్ట్ కూడా మందంగా కనిపించాలి. కొద్ది రోజుల్లో అది తుడుచుకుపోయే పరిస్థితి లేకపోలేదు. రూ.లక్షల ప్రజాధనం వృథా అయ్యే అవకాశం ఉంది.

- ఇష్టారాజ్యంగా ఆర్ట్ పనులు
- కొరవడిన నాణ్యత
- రూ.20 లక్షల నిధుల కేటాయింపు
- కాంట్రాక్టర్‌కు లబ్ధి చేకూర్చేందుకు పరోక్షంగా సహకరిస్తున్న ఇంజినీర్లు

అనంతపురం కార్పొరేషన్: యోగాంధ్ర పేరుతో తెలుగు తమ్ముళ్లు దోపిడీకి తెరలేపారు. దీపం ఉండగానే ఇల్లు చక్కదిద్దుకునే నానుడిని బాగా అనుసరిస్తున్నారు. భారీగా లబ్ధి పొందేందుకు అన్ని మార్గాలను అనుసరిస్తూ.. ఇష్టారాజ్యంగా అభివృద్ధి పనులను చేపడుతున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక నాగరాజు, రామలింగేశ్వర్ కమిషనర్లుగా ఉన్న సమయంలో పూడికతీత పేరుతో రూ.లక్షల ప్రజాధనాన్ని వృథా చేశారు. తూతూమంత్రంగా పనులు చేశారు. ఇప్పుడు మరో దారి దోపిడీకి తెరలేపారు. యోగాంధ్ర పేరుతో నగరంలో జరుగుతున్న ఆర్ట్ పనుల్లో పూర్తిగా నాణ్యత ప్రమాణాలు పాటించలేదు. ఎక్కడైనా గోడలకు బొమ్మలు వేస్తే అందంగా కనిపించాలి. కానీ కొన్ని చోట్ల వేస్తున్న బొమ్మలు కళావిహీనంగా కనిపిస్తున్నాయి. దీని ద్వారా సదరు పనులు చేపడుతున్న వారికి భారీగా లబ్ధి చేకూరుతోంది. అందుకు నగరపాలక సంస్థ ఇంజినీర్లు చూసీ..చూడనట్లు వ్యవహరించడంతో కాంట్రాక్టర్ ఇష్టారాజ్యంగా పనులు చేస్తున్నారు.

చదరపు అడుగుకు రూ.120 ఖర్చు

ఇటీవల ప్రభుత్వం యోగాంధ్ర కార్యక్రమాలకు పిలుపునిచ్చింది. అందులో భాగంగా నగరపాలక సంస్థ సాధారణ నిధులతో నగరంలోని టవర్‌క్లాక్ ఆర్‌ఓబీ కింది వైపు, బళ్లారి బైపాస్, పాత ఎంఆర్‌ఓ కార్యాలయం ఎదురుగా, కళ్యాణదుర్గం బైపాస్ ప్రాంతాల్లో మూడు వర్కులు రూ.20 లక్షలతో ఆర్ట్ పనులు చేపట్టారు. కాగా ఆర్ట్ పనులకు సంబంధించి చదరపు అడుగు రూ.120 టెండర్‌లో నమోదు చేశారు. వాస్తవంగా ఇప్పుడు చేపడుతున్న పనులకు కనీసం చదరపు అడుగు రూ.60 ఖర్చు కూడా కాదని నగరపాలక సంస్థ వర్గాలు చెబుతున్నాయి. కానీ కాంట్రాక్టర్‌కు లబ్ధి చేకూర్చేందుకు ఇంజినీర్లు పరోక్షంగా సహకరిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. దీనిపై విచారణ చేపడితే అసలు వాస్తవాలు వెలుగులోకి వస్తాయని జోరుగా ప్రచారం జరుగుతోంది. వాస్తవంగా ఈ పనులను ఇంజినీర్లు ఏమాత్రం పర్యవేక్షించడం లేదు. ఏఈ నుంచి డీఈ, ఈఈ, ఎస్ఈలు అటువైపు తొంగి చూడకుండా కాంట్రాక్టర్‌కు బాసటగా నిలుస్తున్నారు.



కళావిహీనంగా కనిపిస్తున్న బొమ్మలు

క్లుప్తంగా

బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం

రాప్తాడు: ప్రతి ఉద్యోగికి బదిలీ తప్పదు. ఎక్కడా విధులు నిర్వహించినా సేవలు చిరస్థాయిగా నిలిచిపోతాయని రాప్తాడు ఉన్నత పాఠశాల హెచ్‌ఎం రాజేశ్వరి పేర్కొన్నారు. బుధవారం రాప్తాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న పలువురు ఉపాధ్యాయులు బదిలీ అయ్యారు. బదిలీ అయిన హెచ్‌ఎం సాంబశివుడు, పీడీ కేశవ మూర్తి, ఉపాధ్యాయులు వెంకట నరసింహులు, సాయి ప్రసాద్, హర్షద్ హుస్సేన్, ఉమాదేవి, అనూరాధ, రమేష్, గోపాల్ రెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ.. దాదాపుగా 8 సంవత్సరాలుగా ఈ పాఠశాల అభివృద్ధికి విశేష సేవలు అందించిన ఉపాధ్యాయులు మరొక పాఠశాలకు వెళ్తుండటం బాధాకరమన్నారు. నేను కూడా మరొక పాఠశాల నుంచి బదిలీపై ఈ పాఠశాలకు వచ్చానని.. పాఠశాల అభివృద్ధితో పాటు విద్యాభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు. అనంతరం నూతన ఉపాధ్యాయులకు స్వాగతం పలికారు. కార్యక్రమంలో పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ గంజి లక్ష్మీదేవి, వైస్ చైర్మన్ లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చీరల పంపిణీ

అనంతపురం టవర్‌క్లాక్: జై భీమ్ రావ్ భారత్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక అనాథాశ్రమంలోని వృద్ధులకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు వీరనాగరాజు మాట్లాడుతూ.. వృద్ధాప్యంలో తల్లిదండ్రులను జాగ్రత్తగా చూసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు నరేష్ కొడవండ్ల, రామప్ప నాయక్ పాల్గొన్నారు.

యోగాతో మానసిక ఆరోగ్యం



యోగా కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

అనంతపురం సెంట్రల్: యోగాతో మానసిక ఆరోగ్యం లభిస్తుందని జిల్లా రవాణాశాఖ అధికారి సురేష్ నాయుడు తెలిపారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం ఆర్టీఓ కార్యాలయంలో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్టీఓ మాట్లాడుతూ.. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం యోగా కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యం కోసం యోగాను దినచర్యగా చేసుకొని శారీరక, మానసిక ఆరోగ్యం పొందాలని కోరారు. కార్యక్రమంలో డీఎంహెచ్ఓ ఈబీదేవి, కళ్యాణదుర్గం ఆర్టీఓ రమేష్, ఎంవీఐలు శ్రీనివాసులు, శ్రీనివాసులు, రాజగోపాల్, ఏఎంవీఐలు కేవీఎల్ఎస్ ప్రసాద్, శ్రీనివాస్, లహరి, మనోహర్‌రెడ్డి, రఘు, శ్వేతబిందు, సిబ్బంది పాల్గొన్నారు.

'23లోపు లగేజీ తీసుకెళ్లండి'

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం క్యాంపస్ కళాశాలలోని మహానంది హాస్టల్‌లో ఈనెల 3వ తేదీ నుంచి చిన్న, చిన్న మరమ్మత్తులు మొదలు పెట్టడం జరిగింది. ఈ నేపథ్యంలో కొన్ని గదులకు విద్యార్థులు తాళాలు వేసుకుని వెళ్లారు. ఈనెల 23వ తేదీలోపు విద్యార్థులు తమ లగేజీ తీసుకెళ్లాలని వార్డెన్ ప్రొఫెసర్ మునినారాయణప్ప బుధవారం ఓ ప్రకటనలో కోరారు. ఒక వేళ లగేజీ పోయినా వర్సిటీకి ఎటువంటి సంబంధం లేదని పేర్కొన్నారు. రూమ్‌లకు తాళాలు వేసిన విద్యార్థులు వెంటనే వచ్చి డిప్యూటీ వార్డెన్‌ను సంప్రదించాలని సూచించారు.

పోలీస్ టెక్నికల్ టీంకు ప్రోత్సాహకాలు



స్మార్ట్ వాచ్ అందజేస్తున్న ఎస్పీ జగదీష్

అనంతపురం: జిల్లాలో ఐటీ అప్లికేషన్స్ అమలు చేయడంలో ప్రతిభావంతంగా పని చేస్తున్న పోలీస్ టెక్నికల్ టీంకు జిల్లా ఎస్పీ జగదీష్ ప్రోత్సాహకాలు అందజేశారు. 25 మంది పోలీస్ ఐటీ కోర్ టీం సిబ్బందికి స్మార్ట్ వాచ్‌లు ఇచ్చారు. జిల్లాలో ఇటీవల నిర్వహించిన కానిస్టేబుల్ అభ్యర్థుల దేహదారుఢ్య పరీక్షల్లో టెక్నికల్ సిబ్బంది ఉత్తమ పనితీరు కనబరిచారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడంతో పాటు శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణకు జిల్లా పోలీసు శాఖ 12 ఐటీ అప్లికేషన్లు అమలు చేస్తోంది. వీటిల్లో సీసీటీఎన్ఎస్, మీ సేవా, స్మార్ట్ పోలీస్, ఐరాడ్, ఈ–చలానా తదితర అప్లికేషన్లను నిర్వహిస్తున్నారు. ఈ అప్లికేషన్ల నిర్వహణలో జాప్యం లేకుండా రాష్ట్ర స్థాయిలో పోటీ పడే రీతిలో టెక్నికల్ టీం సమర్థవంతంగా విధులు నిర్వహిస్తోంది.

ఇంటింటా చెత్త సేకరణలో జాప్యం

- ఆగ్రహం వ్యక్తం చేసిన కమిషనర్ బాలస్వామి
- శానిటేషన్ సెక్రటరీకి సస్పెన్షన్ నోటీస్, ఇన్‌స్పెక్టర్‌కు షోకాజ్ జారీ

అనంతపురం కార్పొరేషన్: నగరంలోని జీసస్ నగర్‌లో మూడు రోజులుగా ఇంటింటా చెత్త సేకరణ జాప్యంపై కమిషనర్ బాలస్వామి ఆగ్రహం వ్యక్తం చేశారు. కమిషనర్‌కు ఫిర్యాదు రావడంతో క్షేత్రస్థాయిలో విచారణ చేయించగా నిజమని తెలిసింది. 45వ సచివాలయ శానిటేషన్ సెక్రటరీ నరసింహ మూర్తికి సస్పెన్షన్ నోటీసు, అదేవిధంగా 3వ సర్కిల్ శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ వెంకటేష్‌కు షోకాజ్ నోటీసు జారీ చేశారు. వాస్తవంగా శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్ నిర్లక్ష్యంతోనే ఇంటింటా చెత్త సేకరణ జాప్యం జరుగుతోంది. మూడవ సర్కిల్‌లో వెంకటేష్ పర్యవేక్షించే పరిస్థితే లేదు. శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ డ్రస్ కోడ్ కూడా వేసుకోకుండా విధులను నిర్లక్ష్యం చేస్తున్నారు. ఇతని కారణంగానే ఆదర్శ నగర్, నాయక్ నగర్, జీసస్ నగర్, విద్యుత్ నగర్, తదితర ప్రాంతాల్లో పారిశుధ్య అస్తవ్యస్తంగా మారింది. వెంకటేష్ ఏ సర్కిల్‌లో పని చేసినా ఆ ప్రాంతంలో పారిశుధ్య కార్యదర్శులు నిర్లక్ష్యంగా పని చేస్తున్నారు. కమిషనర్ లోతుగా విచారణ చేపడితే వాస్తవాలు బయటకొచ్చే అవకాశం లేకపోలేదు.

రజకులపై దాడులు అరికట్టాలి



నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

అనంతపురం టవర్‌క్లాక్: రజకులపై దాడులను అరికట్టి భద్రత కల్పించాలని రజక వృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లింగమయ్య డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద సమాఖ్య ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా లింగమయ్య మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి సొంత నియోజక వర్గంలో రజక మహిళను చెట్టుకు కట్టేసి దారుణంగా కొట్టడం దుర్మార్గమని మండిపడ్డారు. అప్పు ఇవ్వాల్సి ఉంటే మాట్లాడుకుని వసూలు చేసుకోవాలని తెలిపారు. దాడి చేసిన వారిని వెంటనే శిక్షించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో వడ్డీ వ్యాపారుల ఆగడాలు మితిమీరుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో బంగారు బాష, నాగప్ప, రఘు, టిసి భూషణ్, ఈశ్వరమ్మ, రాజు, లక్ష్మీనారాయణ, పాండు, రాయుడు, నాగరాజు, శ్రీను, నరసింహులు, మారుతి, వెంకటేష్, మల్లు తదితరులు పాల్గొన్నారు.

21 నుంచి సర్టిఫికెట్ల వెరిఫికేషన్

తాడిపత్రిటౌన్: పట్టణంలోని ఆటోనగర్ సమీపంలో ఉన్న పాలిటెక్నిక్ కళాశాలలో 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రవేశాలకు సాంకేతిక విద్యాశాఖ నోటిఫికేషన్ విడుదల చేసినట్లు ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ వీరాస్వామి బుధవారం తెలిపారు. పాలిసెట్–2025లో ర్యాంకు సాధించిన వారు అర్హులన్నారు. ఎస్సీ, ఎస్టీలు రూ.250, ఓసీ, బీసీలు రూ.700 ఆన్‌లైన్‌లో ప్రాసెసింగ్ ఫీజు చెల్లించి రసీదుతో పాటు ఒరిజినల్ సర్టిఫికెట్లు, రెండు సెట్ల జిరాక్స్ సెట్‌లతో ఈనెల 21 నుంచి 28 వరకు జరిగే సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు హాజరుకావాలన్నారు. ఈనెల 25 నుంచి 30వ తేదీ వరకూ వెబ్ ఆప్షన్ ఇస్తామని తెలిపారు. ఎస్టీ, స్పెషల్ కేటగిరీ విద్యార్థులు నిర్ణయించిన తేదీల్లో విజయవాడలో హాజరు కావాలన్నారు. వివరాలకు హెల్ప్‌లైన్ 7901620198, 9493773778 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

నిరుద్యోగ భృతి అమలు చేయరా?



పోస్టర్లు విడుదల చేస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

అనంతపురం అర్బన్: నిరుద్యోగ భృతి హామీని విస్మరించిన కూటమి ప్రభుత్వం యువతను మోసం చేసిందని ఏఐవైఎఫ్ నాయకులు ధ్వజమెత్తారు. హామీలు అమలు చేయని ప్రభుత్వంపై ఉద్యమిద్దామని పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక సంఘం కార్యాలయంలో పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి సంతోష్ కుమార్ మాట్లాడుతూ.. ఒక్క అనంతపురం జిల్లాలోనే 7.24 లక్షల మంది నిరుద్యోగులు ఉన్నారంటే రాష్ట్రవ్యాప్తంగా నిరుద్యోగ సమస్య ఎంత ఉంటుందో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదన్నారు. నిరుద్యోగ యువతకు నెలకు రూ.3 వేలు నిరుద్యోగ భృతి చెల్లిస్తామని ఎన్నికల్లో ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు హామీ ఇచ్చారన్నారు. అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా హామీని అమలు చేయలేదన్నారు. భృతి ఇస్తే ఆ డబ్బులతో పోటీ పరీక్షలకు శిక్షణ పొందుదామని ఆశతో ఎదురు చూస్తున్న నిరుద్యోగులను నట్టేట ముంచారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం తిరకాసు ధోరణిలో కాకుండా సూపర్‌సిక్స్ హామీలను నిజాయితీగా అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, కుళ్లాయిస్వామి, ధనుంజయ, సరేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

ఏఐఎస్ఎఫ్ నాయకులపై దాడి హేయం



ఆందోళన చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: కార్పొరేట్ విద్యా సంస్థల్లో ఫీజుల దోపిడి అరికట్టాలని విజయవాడలో శాంతియుతంగా ఆందోళన చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులపై దాడి చేసిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక అంబేడ్కర్ విగ్రహం ఎదుట ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హనుమంతు రాయుడు, కుళ్లాయి స్వామి మాట్లాడారు. విజయవాడలో శాంతియుతంగా ధర్నా చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు వలరాజు, సాయికుమార్‌పై పోలీసులు దాడి చేయడం దుర్మార్గమన్నారు. పోలీసులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఫీజుల దోపిడీ అరికట్టమని అడిగితే విద్యార్థి నాయకులపై దాడులు చేయడం సిగ్గుచేటన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా కార్పొరేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు అధికంగా ఎన్డీఏ ప్రభుత్వంలో ఉన్నటువంటి ప్రజా ప్రతినిధులవే అన్నారు. ఇక ప్రభుత్వ విద్యాసంస్థలు ఎక్కడ అభివద్ధి చెందుతాయని ప్రశ్నించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నగర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మంజునాథ్, ఉమామహేష్, నగర కోశాధికారి నాని, నాయకులు పవన్, ఆనంద్, సాయి కుమార్, కార్తీక్, యశ్వంత్, బాబ్జాన్, రూపేష్, సోమేష్, ప్రశాంత్ పాల్గొన్నారు.

పంటల సాగులో మెలకువలు తప్పనిసరి



మాట్లాడుతున్న ఏఓ కృష్ణ చైతన్య

రాప్తాడు: పంటల సాగు సమయంలో రైతులు మెలుకువలు తప్పనిసరిగా పాటించాలని మండల వ్యవసాయాధికారి కృష్ణ చైతన్య పేర్కొన్నారు. బుధవారం మరూరు గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న విత్తన వేరుశనగ కాయలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అన్నదాత సుఖీభవ సంబంధించి ఈ–కేవైసీ పెండింగ్‌లో ఉన్నవారు మాత్రమే ఈకేవైసీ చేపించుకోవాలన్నారు. వ్యవసాయ సిబ్బంది సూచనల మేరకు దుక్కులు, విత్తనం, ఎరువులు వేయడం, పురుగు మందులు చల్లడం వంటి వాటిపై రైతులు అవగాహన పెంచుకోవాలని సూచించారు. మండలంలో ప్రధానంగా వరి, వేరుశనగ, కంది పంటలు సాగు చేస్తారని, వరి నాటేటప్పుడు తక్కువ పిలకలు మాత్రమే నాటాలన్నారు. అలాగే వేరుశనగ, కంది పంటలు సాగు చేసే రైతులు విత్తన శుద్ధి తప్పక చేసుకోవాలన్నారు. మండల పట్టు పరిశ్రమ సాంకేతిక అధికారి భీమిరెడ్డి అంజన్ రెడ్డి మాట్లాడుతూ.. సాంప్రదాయ పంటలతో పాటు వాణిజ్య పంటల వైపు కూడా రైతులు దృష్టి సారించాలన్నారు. అప్పుడే రైతు కుటుంబాలు ఆర్థికంగా పరిపుష్టి సాధించగలుగుతాయని తెలిపారు. పట్టు పురుగుల పెంపకం చేపట్టడానికి ఆసక్తి ఉన్న రైతులకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనేక రాయితీలు అందిస్తున్నాయని పేర్కొన్నారు. మల్బరీ సాగుకు ఎకరానికి రూ.22,500, పట్టు పురుగుల పెంపకం గదిని నిర్మించుకోవడానికి రూ.3.37 లక్షలు అందజేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో రైతు సేవా కేంద్రం అధికారి హర్షవర్దన్, ఎంపీఈఓ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

మహిళ ఆచూకీ లభ్యం



మహిళను తహసీల్దార్ ఎదుట హాజరుపరిచిన పోలీసులు

అనంతపురం సెంట్రల్: నగరంలో 5వ రోడ్డుకు చెందిన కుమ్మరి భవాని ఆచూకీ లభ్యమైంది. బుధవారం తహసీల్దార్ హరికుమార్ ఎదుట హాజరుపరిచి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు త్రీటౌన్ సీఐ శాంతిలాల్ తెలిపారు. తన భార్య దక్షాయని (పుట్టుకతో మూగ) కనిపించకుండా పోయిందని మంగళవారం రాత్రి 10 గంటల సమయంలో ఆమె భర్త ప్రదీప్ కుమార్ పోలీసులను ఆశ్రయించారు. కుమారుడిని కర్ణాటకకు తీసుకెళ్లే విషయంలో మనస్థాపానికి గురైన దక్షాయని ఇంట్లో ఎవరికి చెప్పకుండా ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయింది. భర్త ప్రదీప్ కుమార్ పోలీసులను ఆశ్రయించడంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. సెల్ ఫోన్ సిగ్నల్ ఆధారంగా రాత్రంతా గాలించారు. చివరకు కళ్యాణదుర్గం రోడ్డులో తమకు తెలిసిన వారి ఇంట్లో దక్షాయిని ఉన్నట్లు కనుక్కొన్నారు. బుధవారం తహసీల్దార్ ఎదుట హాజరుపరిచి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

గార్లదిన్నె: కల్లూరు పెన్నానది నుంచి ఇసుక తరలిస్తున్న 3 ట్రాక్టర్లను పట్టుకున్నట్లు పోలీసులు తెలిపారు. బుధవారం పెద్దవడుగూరు మండలం కొండూరుకు చెందిన 2 ట్రాక్టర్లు, అనంతపురానికి చెందిన ఒక ట్రాక్టర్ పెన్నానది నుంచి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. డీఎస్పీ వెంకటేషులు సిబ్బందితో కలిసి ఘటన స్థలానికి వెళ్లి ట్రాక్టర్లను పట్టుకొని స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ట్రాక్టర్ల యజమానులపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

'నారాయణ'లో అక్రమంగా పుస్తకాల విక్రయం



పుస్తకాలు విక్రయిస్తున్న గదిని సీజ్ చేసిన దృశ్యం

అనంతపురం ఎడ్యుకేషన్: నిబంధనలకు విరుద్ధంగా స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని నారాయణ ఇంగ్లిష్ మీడియం పాఠశాల విద్యార్థులకు పుస్తకాలు, దుస్తులు విక్రయిస్తుండటంతో బుధవారం ఏబీవీపీ నాయకులు వెళ్లి అడ్డుకున్నారు. నేరుగా డీఈఓకు ఫోన్‌లో ఫిర్యాదు చేయగా.. సిబ్బంది వచ్చి పుస్తకాలు, దుస్తుల గదిని సీజ్ చేశారు. అలాగే నగరంలోని సంగమేష్ నగర్‌లోని మరో ప్రైవేట్ పాఠశాలలోనూ పుస్తకాల అమ్మకాలను అడ్డుకున్నారు. ఇక్కడికి కూడా డీఈఓ కార్యాలయ సిబ్బంది వెళ్లి గదిని సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి అఖిల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. నారాయణ విద్యా సంస్థలు దోపిడీ చేస్తున్నాయన్నారు. నిబంధనలు పాటించని విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు, దివాకర్ నాయక్ విజయ్, హరిప్రసాద్ నాయక్, వెంకటేష్, కుమార్, మణిదీప్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువతి మృతి

రాప్తాడు: మండలంలోని పెసరకుంట గ్రామానికి చెందిన దేవర కొండ యమున (20) చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందింది. రాప్తాడు పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పెసరకుంట గ్రామానికి చెందిన దేవరకొండ ఆనంద్‌కు ఇద్దరు కుమార్తెలు. మొదటి కుమార్తె భవానికి వివాహం అయ్యింది. రెండవ కుమార్తె దేవరకొండ యమున ఇంటర్ పూర్తి చేసి ఇంటి దగ్గరే ఉంది. ఇంటి వద్ద ఉంటూ పని చేయడం లేదని.. ఇంట్లో ఎప్పుడూ టీవీ చూస్తుంటావని తల్లిదండ్రులు మందలించారు. మనస్థాపం చెందిన యమున.. ఈనెల 13న రాత్రి పురుగుల మందు తాగింది. అనంతరం బయటకు వచ్చి కడుపులో మంట అని బాధపడుతుండటంతో ఏమైందని తల్లిదండ్రులు ఆరా తీశారు. మీరు మందలించడంతో పురుగుల మందు తాగానని చెప్పింది. వెంటనే కుటుంబ సభ్యులు ఆమెను చికిత్స నిమిత్తం అనంతపురంలోని సర్వజన ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

మేదర సంఘం అధ్యక్షుడిగా వెంకటేశ్వర్లు

అనంతపురం కల్చరల్: రాష్ట్ర మహేంద్ర (మేదర) సంఘం నూతన అధ్యక్షుడిగా పోలేపల్లి వెంకటేశ్వర్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు బుధవారం సాయంత్రం మల్లాలమ్మ ఆలయ ప్రాంగణంలో 2025–28 కాల వ్యవధికి నూతన కార్యవర్గ ఏర్పాటుకు ఎన్నికలు నిర్వహించారు. ప్రధాన కార్యదర్శిగా అశోక్ కుమార్, కోశాధికారిగా టీఎం వెంకట రాముడు, ప్రచార కార్యదర్శిగా పోతుల రాజు, గౌరవాధ్యక్షులుగా పీఎం వేణుగోపాల్, కేఎం వెంకటేశ్వర్లు నూతన కమిటీలో చోటు దక్కించుకున్నారు. మాజీ అధ్యక్షుడు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి రాష్ట్ర నాయకులు జి.రంగయ్య, పీఎం వీరభద్రయ్య, నాగేంద్ర ఎలక్షన్ ఆఫీసర్లుగా వ్యవహరించారు. అనంతరం జరిగిన సమావేశంలో పేద మేదర విద్యార్థులకు పుస్తకాలు, ఇతర విద్యా సామగ్రి, ఇంటర్, పదవ తరగతుల్లో ప్రతిభ కనబరిచిన వారికి ప్రోత్సాహక బహుమతులు అందజేస్తామని పేర్కొన్నారు.

ఆటపాటలతో విద్యా బోధన



తలుపూరులో అక్షరాభ్యాసం చేయిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు



గ్రాడ్యుయేషన్ డేలో పాల్గొన్న చిన్నారులు, అంగన్‌వాడీ సిబ్బంది



చిన్నారితో అక్షరాలు దిద్దిస్తున్న సూపర్‌వైజర్ జ్యోతి

రాప్తాడు: అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆటపాటలతో విద్యా బోధన చేస్తామని అనంతపురం రూరల్ ప్రాజెక్ట్ సీడీపీఓ ఉమా శంకరమ్మ పేర్కొన్నారు. బుధవారం రాప్తాడులోని ఐదో నంబర్ అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగరత్న ఆధ్వర్యంలో అంగన్‌వాడీ పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ముందుగా అంగన్‌వాడీ కేంద్రంలో గాడ్యుయేషన్ డే, అక్షరాభ్యాసం, సామూహిక సీమంతాలు నిర్వహించారు. అనంతరం చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని ర్యాలీ చేపట్టారు. అనంతరం సీడీపీఓ మాట్లాడుతూ.. మూడు నుంచి ఐదేళ్లలోపు చిన్నారులను విధిగా అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలన్నారు. ఇక్కడ ఆట పాటలతో కూడిన విద్యతో పాటు సకాలంలో పౌష్టికాహారం అందించి ఆరోగ్యకరంగా ఎదిగేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పోషక విలువలున్న ఆహారం అందించడం ద్వారా పిల్లల్లో రక్తహీనత సమస్య తలెత్తదని పేర్కొన్నారు. సామూహిక ప్రీ స్కూల్ కిట్, ప్రీ స్కూల్ కిట్ ప్రాముఖ్యత, గర్భిణులు ప్రసవాలకు వెళ్లేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. కాన్పు అయిన వెంటనే ప్రతి తల్లి బిడ్డకు ముర్రుపాలు తాపాలన్నారు. ముర్రుపాలు ద్వారా చాలా లాభాలున్నాయని వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు విజయలక్ష్మి, లక్ష్మీదేవి, భారతి, ముత్యాలమ్మ, సావిత్రి, ఆయాలు సుశీల, మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల్లో అక్షరాభ్యాసం

ఆత్మకూరు: వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు పునఃప్రారంభం అయ్యాయి. బుధవారం మండల వ్యాప్తంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో సామూహిక అక్షరాభాస్యం కార్యక్రమం నిర్వహించినట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్స్ లావణ్య, శ్రీవాణి తెలిపారు. పిల్లలతో పలకల మీద అక్షరాలను దిద్దించారు. గ్రామాల్లో ఎవరైనా మూడు సంవత్సరాలు పైబడిన పిల్లలు ఉంటే అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని తల్లిదండ్రులకు సూచించారు. అంగన్‌వాడీల్లో చేర్పించడం ద్వారా నాణ్యమైన విద్యతో పాటు పోషకాహారం అందుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే

అనంతపురం సెంట్రల్: నగరంలో మారుతీనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం 5 సంవత్సరాలు పూర్తి చేసుకొని అంగన్‌వాడీ కేంద్రం నుంచి పాఠశాలకు వెళ్తున్న చిన్నారులకు గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమం నిర్వహించారు. అలాగే కొత్తగా వచ్చే చిన్నారులతో అక్షరాభ్యాసం చేయించారు. ప్రతి చిన్నారి చదువుపై ఆసక్తి పెరిగేందుకు ఈ కార్యక్రమం నిర్వహించినట్లు అంగన్‌వాడీ వర్కర్ జమున తెలిపారు. ఝాన్సీ లక్ష్మీబాయి ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం కృష్ణమూర్తి, అంగన్‌వాడీ హెల్పర్ శ్యామల, ఏఎన్‌ఎం గీత పాల్గొన్నారు.



రాప్తాడులో ర్యాలీ నిర్వహిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

అనంతపురం ఎడ్యుకేషన్: అంగన్‌వాడీ కేంద్రంలో ఆటపాటలతో కూడిన విద్యను అందిస్తున్నామని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జ్యోతి తెలిపారు. అనంతపురం రూరల్ 5వ సెక్టార్ పరిధిలోని ఏ నారాయణపురం–2 అంగన్వాడీ కేంద్రంలో కొత్తగా చేరిన పిల్లలకు బుధవారం అక్షరాభ్యాసం చేయించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ జ్యోతి చిన్నారులతో అక్షరాలు దిద్దించి ఆటలు పాటల ద్వారా ఎలా చదువుతారో చూపించారు. మూడేళ్ల వయసున్న చిన్నారులను అంగన్వాడీ కేంద్రంలో చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్ లావణ్య, హెల్పర్ చాందినీ పాల్గొన్నారు.